నాయకుడి కుటుంబానికి బీఆర్ఎస్ అండ



చింతస్వామిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

శివ్వంపేట, సెప్టెంబర్ 2: మండలంలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు చింత స్వామి కుటుంబానికి అండగా ఉంటానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. చింతస్వామి కుమారుడు చింత శ్రీధర్ మృతి చెందడంతో సోమవారం ఎమ్మెల్యే పరామర్శించారు. క్షణికావేశంలో యువకులు తొందరపాటు నిర్ణయాలు తీసుకుని తల్లిదండ్రులకు శోకం మిగిల్చవద్దని ఆమె కోరారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, పార్టీ మండల అధ్యక్షుడు రమణ గౌడ్, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, మాజీ కో ఆప్షన్ సభ్యుడు లాయక్, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, నాయకులు మర్రి మహేందర్ రెడ్డి, యాదగౌడ్, రాజశేఖర్‌గౌడ్, సిలువేరి ఆంజనేయులు, పానగారి వెంకటేశ్, బ్యాగరి నర్సయ్య, సూరారం నర్సింలు, సత్యంగౌడ్ ఉన్నారు.

నీటి వనరుల వివరాలు అందజేయాలి

పాల్గొన్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ పరిధిలోని ప్రిలిమినరీ, ఫైనల్ నోటిఫికేషన్ జిల్లాల వారీగా సరస్సుల వివరాలు అందజేయాలని హెచ్ఎండీఏ కమిషనర్ సర్వరాజ్ అహ్మద్ అదనపు కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. జిల్లాలోని మనోహరాబాద్, తూప్రాన్, నర్సాపూర్, శివ్వంపేట్ మండలాల్లో సరస్సులకు సంబంధించి ప్రిలిమినరీ ఫైనల్ నోటిఫికేషన్ ప్రతిపాదనలు సిద్ధం చేసి గడువు తేదీలోగా అందజేస్తామన్నారు. కాన్ఫరెన్స్‌లో ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

కరెంటు కోసం సబ్‌స్టేషన్ ముట్టడి

గడిపెద్దాపూర్ సబ్ స్టేషన్‌ను ముట్టడించిన దాదాయిపల్లి గ్రామస్తులు

అల్లాదుర్గం, సెప్టెంబర్ 2: విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో సబ్‌స్టేషన్ ముట్టడించారు. టేక్మాల్ మండలం దాదాయిపల్లి గ్రామానికి అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్తు సరఫరా అవుతున్నది. రెండు రోజులుగా విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో గ్రామంలో అంధకారం నెలకొన్నది. విద్యుత్తు అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. విద్యుత్ లేకపోవడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో దాదాయిపల్లి గ్రామస్తులు గడిపెద్దాపూర్ సబ్‌స్టేషన్‌ను సోమవారం ముట్టడించి, నిరసన వ్యక్తంచేశారు. గ్రామస్తుల నిరసనతో దిగివచ్చిన అధికారులు విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు.

ట్యాంకర్ నీటికి డబ్బులు అడుగుతున్నారని నిరసన

శివ్వంపేట, సెప్టెంబర్ 2: గ్రామంలోని పంచాయతీకి సంబంధించిన వాటర్ ట్యాంకర్ కావాలని అడిగితే పంచాయతీ కార్యదర్శి రూ.2 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని చెన్నాపూర్ గ్రామస్తులు ఆరోపించారు. ప్రతి చిన్న విషయానికి డబ్బులు డిమాండ్ చేస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సోమవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు బొల్ల భిక్షపతి, బొల్ల ఆంజనేయులు, మధు, నర్సింలు, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానల్లో ఖాళీలు భర్తీ చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 2: ప్రభుత్వ దవాఖానల్లో ఖాళీ డాక్టర్ పోస్టులను వెంటనే భర్తీ చేయ్యాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఎమ్‌హెచ్‌వో శ్రీరామ్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, నాయకులు నాగమణి, లచ్చాగౌడ్ మాట్లాడుతూ జిల్లాలోని మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట ప్రభుత్వ దవాఖానలు, పీహెచ్‌సీల్లో డాక్టర్లను నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో వంద పడకల దవాఖాన ఉన్నా సరిపడా డాక్టర్లు లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానలో డాక్టర్ల కొరత, రామాయంపేటలో సౌకర్యాలు లేవన్నారు.

దుబాయికి వెళ్లిన ఒకరు మృతి

ఎంపీతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మెదక్‌రూరల్, సెప్టెంబర్ 2: తిమ్మక్కపల్లి గ్రామానికి చెందిన రాట్ల సూర్య ఆగస్టు 6న దుబాయ్‌కు బతుకు దెరువుకు వెళ్లి, అక్కడ నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లు ఏజెంట్ చెప్పాడు. సూర్య మృతదేహాన్ని ఇంటికి తీసుకురావడానికి బీజేపీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి ఎలక్షన్‌రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావును సోమవారం కలిసి విషయాన్ని వివరించారు. దీంతో ఎంపీ స్పందిస్తూ అక్కడి ఎంబాసిస్‌లో భారత రాయబార సంస్థతో మాట్లాడి సూర్య మృతదేహాన్ని తీసుకురావడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మృతుడి కుటుంబానికి ధైర్యం చెప్పి ఓదార్చారు. బాధిత కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుదన్నారు.

'సకురా సైన్స్'కు నలుగురు అధ్యాపకులు ఎంపిక

నర్సాపూర్, సెప్టెంబర్ 2: బీవీఆర్ఐటీ కళాశాలకు చెందిన నలుగురు అధ్యాపకులు జపాన్ స్పాన్సర్ చేసిన సకురా సైన్స్ ప్రోగ్రామ్‌కు ఎంపికయ్యారు. ఎస్‌వీఈఎస్ నుంచి అధ్యాపకులు రాజు, పవన్‌కుమార్, భానుప్రకాశ్, సంతోష ఎంపికయ్యారని శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సంస్థల చైర్మన్ విష్ణురాజు తెలిపారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు ఇన్‌సెట్‌లో అనూష (ఫైల్)

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 2: వేధింపులు తాళలేక వివాహిత మృతి చెందిన ఘటన హవేళీఘనపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోచంరాల్‌లో జరిగింది. ఎస్సై కథనం ప్రకారం.. పోచంరాల్‌కు చెందిన అనూష (23) భర్త మల్లికార్జున్, అత్తమామలు అదనపు కట్నం తీసుకురావాలని వేధించారు. దీంతో ఆగస్టు 29న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఈ నెల 1న మృతి చెందింది. భర్త, అత్తమామల వేధింపులే కారణమని మృతురాలి బంధువులు స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. మృతురాలికి ఏడాది వయస్సు గల బాబు ఉన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రామాయంపేట: పురపాలికలోని కోమటిపల్లి చెరువు నిండడంతో పారుతున్న వరద

వెల్దుర్తి: మాసాయిపేట హల్దీప్రాజెక్టు నీటి ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీవో, ఆర్ఐలు

రేగోడ్: కొండాపూర్, జాగిర్యాల చెరువు తూమును పరిశీలిస్తున్న తహసీల్దార్ తదితరులు

చిన్నశంకరంపేట: భారీ వర్షాలతో జంగరాయి మత్తడికి పడిన గండి

రెండో రోజూ వీడని వాన

రామాయంపేట/ రేగోడ్/ చిన్నశంకరంపేట/ వెల్దుర్తి/ కొల్చారం/నిజాంపేట/పాపన్నపేట, సెప్టెంబర్ 2: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు, వాగులు, కుంటలు నీటితో నిండిపోయాయి. కొన్ని చెరువులు అలుగు పారుతున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షం వీడటం లేదు. మంజీరా నదిలో వరద కొనసాగుతున్నది. ఘనపూర్ ఆనకట్ట పొంగిపొర్లుతుండడంతో ఏడుపాయల దుర్గమ్మ ఆలయం ముందు నుంచి మంజీరా పరుగులు తీస్తున్నది. దీంతో అమ్మవారి ఆలయం మూసివేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు చెరువులు నిండి, అలుగు పారుతున్నాయి. ప్రజలు చెరువులు, వాగులు, కుంటల వైపు వెళ్లొద్దని, విద్యుత్ స్తంభాలు ముట్టుకోవద్దని అధికారులు సూచిస్తున్నారు. కూలిన ఇండ్లను పరిశీలించారు. పాక్షికంగా కూలిన ఇండ్లల్లోంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉండరాదని హెచ్చరించారు. ప్రజలు చెరువులు, అలుగుల వెంట చేపల వేట సాగిస్తూ కనిపించారు. పలు చోట్ల చెరువులకు గండిపడిన వాటిని పూడ్చివేశారు.

వెల్దుర్తి: పొంగిపొర్లుతున్న హల్దీ ప్రాజెక్టు

నిజాంపేటలో మత్తడి దూకుతున్న మల్కచెరువు

పాపన్నపేట: అన్నారంలో కూలిన ఇంటిని పరిశీస్తున్న ఆర్డీవో రమాదేవి తదితరులు

శివ్వంపేట: అలుగు పారుతున్న ఏదుల్లాపూర్ చెరువు ప్రధాన రహదారి పక్కన నిలిచిన వర్షపు నీరు

చిన్నశంకరంపేట: చందంపేట పెద్ద చెరువుకు పడిన బుంగను పూడ్చివేస్తున్న ఇరిగేషన్ సిబ్బంది

కొల్చారంలో అలుగు పారుతున్న బొబ్బిలి చెరువు, చేపల వేట సాగిస్తున్న యువకులు

రామాయంపేట: భారీ వర్షంతో నిండు కుండలా మారిన మల్లె చెరువు

అల్లాదుర్గం: టేక్మాల్ మండల శివారులో అలుగు పారుతున్న కుడి చెరువు

చేగుంటలో అలుగు పారుతున్న చెరువు, గండిని పరిశీలిస్తున్న అధికారులు, స్థానికులు

రామాయంపేట తహసీల్ కార్యాలయంలో తడిసి ముద్దయిన రికార్డులు

వరద నష్టంపై ప్రభుత్వానికి నివేదిక

- కలెక్టర్ రాహుల్‌రాజ్

మాల్కాపూర్ తండాలోని రోడ్డును పరిశీస్తున్న కలెక్టర్

మెదక్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): భారీ వర్షాలకు జిల్లాలో వరద నష్టాన్ని అంచనా వేసి ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక అందిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో భారీ వర్షాల కారణంగా జిల్లాలో ఆస్తి, ప్రాణ, పంట నష్టంపై శాఖల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అకాల వర్షాలతో వరద నష్టాన్ని అంచనా వేస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 165 ఎకరాల పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారన్నారు. పంచాయతీరాజ్ 9 రోడ్లు, ఆర్ అండ్‌బీ 11 రోడ్లు దెబ్బతిన్నాయని, ఇరిగేషన్ శాఖ ద్వారా ఒక చెరువు, ఒక కెనాల్ బ్రిచ్ అయినట్లు తెలిపామన్నారు. 7 ప్రభుత్వ పాఠశాలలు పాక్షికంగా దెబ్బతిన్నాయని విద్యా శాఖ అంచనా వేసిందన్నారు. పాపన్నపేట మండలం కొంపల్లిలో ఒక పశు మృతి చెందింది, జిల్లాలో 223 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు అంచనా వేశామనానరు. అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం ద్వారా సురక్షితమైన తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, డీఏవో గోవింద్, డీఈవో రాధాకృష్ణ, డీఎంహెచ్‌వో బీ.శ్రీరామ్, అధికారులు పాల్గొన్నారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

మెదక్‌రూరల్ సెప్టెంబర్ 2: జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. మెదక్ మండలంలోని తిమ్మనగర్, రాయిన్‌పల్లి, మాల్కాపూర్, హవేళీఘనపూర్ మండలంలోని ముత్తాయిపల్లి, లింగ్‌సాన్‌పల్లి, ఆయా గ్రామాల్లో ధ్వంసమైన రోడ్లు, పంటలు, కాల్వ లు, చెరువులను పరిశీలించారు. ఆయన వెంట మెదక్, ఘనపూర్‌మండలాల తహసీల్దార్లు లక్ష్మణ్‌బాబు, నవీన్, ఇరిగేషన్ ఏఈ శ్రీహరి ఉన్నారు.

రైతుబీమా, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తుపాకులపల్లిలో రైతుబీమా చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు శ్రీరామ్

మనోహరాబాద్, సెప్టెంబర్ 2: మండలంలోని తుపాకులపల్లి గ్రామానికి చెందిన రైతు యేషం ముత్యాలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రూ.5 లక్షల రైతుబీమా చెక్కును బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుడు మంచ శ్రీరామ్ సోమవారం అందజేశారు. గౌతోజిగూడెంకు చెందిన పానగారి నాగరాజు అనారోగ్యంతో ప్రైవేటు దవాఖానలో చికిత్స చేయించుకుని సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. అతడికి ఎమ్మెల్యే సునీతాల క్ష్మారెడ్డి సహకారంతో మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ ఉప సర్పంచ్ పంచమి రేణుకుమార్, బీఆర్ఎస్ నాయకులు అందజేశారు.

పాఠశాల సమయానికి బస్సులు నడపాలి

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 2: ఆర్‌టీసీ బస్సులను పాఠశాలల సమయానికి నడపాలని మెదక్ డిపో అసిస్టెంట్ మేనేజర్ వీరబాబుకు పీఆర్‌టీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల పనివేళ్లలో మార్పు చేసిన దృష్ట్యా కోరినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, నాయకులు శ్రీనివాస్, అర్నె శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు తెలిపారు.

అదుపుతప్పి కారు బోల్తా

రామాయంపేట, సెప్టెంబర్ 2: రామాయంపేట జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి కారు బోల్తా పడింది. ఎస్సై బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో రామాయంపేట జాతీయ రహదారిపై అదుపు తప్పి కిందకు దూసుకుపోయి చెట్టుకు ఢీకొట్టింది. కారులో ఐదుగురు వ్యక్తులున్నారు. డ్రైవర్ గణేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. అంబులెన్సులో రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

వ్యక్తి అదృశ్యం

శివునూరి రాజయ్య

రామాయంపేట, సెప్టెంబర్ 2: ఒకరు తప్పిపోయిన ఘటన రామాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లాలోని రాజబొల్లారం గ్రామానికి చెందిన శివునూరి రాజయ్య (53) ఆదివారం రామాయంపేట మీదుగా కామారెడ్డి జిల్లా బీబీపేటలోని తన వియ్యంకుడి వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో రామాయంపేటకు చేరుకున్నాడు. ఇక్కడ నుంచి మేడ్చల్ వెళ్లే క్రమంలో రామాయంపేటలో అదృశ్యమైనట్లు అతడి కుమారుడు శ్రీకాంత్ తెలిపాడు. రాజయ్యను ఎవరైనా గుర్తిస్తే 9985987617, 9014405193 లను సంప్రదించాలని శ్రీకాంత్ కోరారు.

ఆయుష్ డాక్టర్ల సస్పెన్షన్

మెదక్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): కొల్చారం పీహెచ్‌సీని గత నెల 31న కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో డాక్టర్ రమేశ్ గైర్హాజర్ కావడంతో ఆయనకు కలెక్టర్ తాఖీదులు జారీ చేసినట్లు డీఎంహెచ్‌వో శ్రీరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌గౌడ్ కూడా గైర్హాజర్ కావడంతో అతడిని సస్పెండ్ చేశారు. ఆయుష్ డాక్టర్ హర్ష, మెడికల్ ఆఫీసర్ రజిత, కాంపౌండర్ పెంటయ్య, సపోర్టింగ్ స్టాఫ్‌ను ఉద్యోగం నుంచి తొలిగించినట్లు పేర్కొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 2: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు ఉపకార వేతనాలకు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలపి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శశికళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల విద్యార్థులు epass.dgg.gov.in వెబ్‌సైట్‌లో ప్రెష్, రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తమ దరఖాస్తులను ప్రిన్సిపాల్ ధ్రువీకరణతో జిల్లా షెడ్యుల్డ్ కులాల కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 2: స్వయం ఉపాధి కోర్సుల్లో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత ఈనెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో పదో బ్యాచ్ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు ఇన్‌చార్జి మనిషా 7396313741 లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా మహంకాళి ఆలయ ఉత్సవాలు

- పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

ఫలహార బండిని ప్రారంభిస్తున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి

చేగుంట, సెప్టెంబర్ 2: స్థానిక మహంకాళి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ వెంకటేశం, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, పరంజ్యోతి, నగేశ్, సం డ్రుగు స్వామి, ఉదయభాస్కర్, సిద్దిరాములు, నర్సింహులు పాల్గొన్నారు. అనంతరం డిష్ రాజు ఏర్పాటు చేసిన ఫలహార బండిని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రాజిరెడ్డి, రాజ్‌గోపాల్, సుభాష్‌రెడ్డి, మైనార్టీ మండల అధ్యక్షుడు మమ్మద్‌అలీ, రవి పాల్గొన్నారు.

గురుకులంలో జూనియర్లపై సీనియర్ల దాడి

ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

గాయపడ్డ విద్యార్థి

తూప్రాన్, సెప్టెంబర్ 2: మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్ టోల్‌ప్లాజా సమీపంలో ఉన్న రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో జూనియర్ విద్యార్థులపై సీనియర్లు దాడి చేసిన ఘటన జరిగింది. చిన్న చిన్న కారణాలతో రెండు నెలల క్రితం ఇంటర్ విద్యార్థులు పదోతరగతి విద్యార్థులపై బకెట్లు, ట్రంక్ పెట్టెలతో దాడి చేశారు. ఈ ఘటన మరువక ముందే, సోమవారం మరో ఘటన చోటుచేసుకున్నది. వివరాలు.. సెంట్ బాటిల్ విషయంలో సీనియర్లకు జూనియర్లపై వచ్చిన ఈగో ఫీలింగ్ తదితర కారణాలతో ఆదివారం అర్ధరాత్రి సమయంలో 9వ తరగతి చదివే ముగ్గురిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. విద్యార్థుల నోట్లో గుడ్డలు కుక్కి బ్యాట్లతో దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ మురళితో వాగ్వాదానికి దిగారు. విద్యార్థులపై ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, కేర్ టేకర్ల పర్యవేక్షణ సరిగా లేక దాడులు జరుగుతున్నాయని పేరెంట్స్ ఆరోపిస్తున్నారు. అప్పుడప్పుడు ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా, విద్యార్థులను భయపెట్టి విషయం బయటకు పొక్కకుండా యాజమాన్యం మేనేజ్ చేస్తున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవడంతో పాటు, దాడికి పాల్పడ్డ 10 మంది విద్యార్థులకు టీసీ ఇచ్చి పంపిస్తామని ప్రిన్సిపాల్ హామీ ఇచ్చారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గురుకుల పాఠశాలలో జరిగే దాడులపై విచారణ జరిపించి, చర్యలు తీసుకోవాలని పేరెంట్స్ కోరుతున్నారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 2: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ సేవలను వినియోగించుకుని, వారి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

భద్రత, బందోబస్తుకే అనుమతులు: ఎస్పీ

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 2: గణేశ్ మండప నిర్వహణకు సంబంధించిన అనుమతులు భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయడానికి సులువుగా ఉంటుందని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణేష్ విగ్రహాల ఏర్పాటుకు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, అందుకోసం https://policeportal.tspolice.gov.in/index.htm ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.